క్లుప్తంగా

క్లోరినేషన్‌కు ప్రాధాన్యమివ్వాలి



వాకతిప్ప వాటర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ ప్రక్రియను సమీక్షిస్తున్న కార్యదర్శి శివచక్రవర్తి

కపిలేశ్వరపురం: గ్రామాల్లోని ప్రభుత్వ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ద్వారా సరఫరా చేసే తాగునీరును విధిగా క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ కొండలరావు ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో క్లోరినేషన్ టెస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై తాగునీరు సరఫరాలో నాణ్యతను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల కార్యదర్శులు క్లోరినేషన్ ప్రక్రియను క్రమం తప్పకుండా పరక్షించాలని ఆదేశించారు.

వేంకటేశ్వరునికి నేడు జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలను నిర్వహించనున్నట్టు సోమవారం వేద పండితులు తెలిపారు. తెల్లవారు జామున స్వామికి పంచామృతాభిషేకం చేయనున్నామన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి



సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈఓ మల్లికార్జుడు

కపిలేశ్వరపురం: అతిసార విజృంభిస్తున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండలంలోని వాకతిప్ప, అంగర, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆదేశించారు. వైద్యాధికారులు పి.చంద్రమౌళి, పి.రత్న కుమారి, కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో ఆయా పీహెచ్‌సీల సిబ్బంది గ్రామ సచివాలయాల్లో సోమవారం అవగాహన సమావేశాలను నిర్వహించారు. కపిలేశ్వరపురంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన, కార్యదర్శి శివచక్రవర్తి పర్యవేక్షణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు మాట్లాడారు. పారిశుధ్య పరిరక్షణ ద్వారా అతిసారను నిలువరించవచ్చన్నారు. సురక్షితమైన నీరును తాగడం ద్వారా వ్యాధికి ప్రభావితం కాకుండా జాగ్రత్తపడవచ్చన్నారు.

జంతువుల సంరక్షణపై అవగాహన సదస్సు



జంతువుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఏడీ రామకృష్ణ తదితరులు

కె.గంగవరం: విద్యార్థి దశ నుంచే జంతువుల సంరక్షణపై సరైన అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ రామచంద్రపురం ఏడీ ఒ.రామకృష్ణ అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సోమవారం జంతువుల సంరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంతువులను పెంచుకోవడం వల్ల శరీరక, మానసిక ఆరోగ్యానికి దోహద పడుతుందన్నారు. దీంతో పాటు సంపాదన కూడా పెరుగుతుందని, మంచి పాలు, పౌష్టిక ఆహారం పొందవచ్చన్నారు. దేశవాళీ ఆవు పేడ ద్వారా ఆర్గానిక్ ఆహారం పండించడం వల్ల మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభించి ఆర్థికంగా లబ్ధి పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ద్రాక్షారామ పశువైద్యాధికారి యం.కృష్ణార్జున్, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, పశువైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి

సఖినేటిపల్లి: ఉపాధి బకాయి వేతనాలు చెల్లించి కూలీలను ఆదుకోవాలని సదరు సంఘ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మోరిపోడులో మేట్ గెడ్డం దేవి అధ్యక్షతన ఉపాధి కూలీల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు ఏడు వారాల నుంచి వేతనాలు అందలేదని, ప్రస్తుతం ఎనిమిదో వారం పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి పని చేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ చట్టం చెబుతున్నప్పటికీ, అధికారుల ఉదాసీన వైఖరి వల్ల వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని శ్రీనివాసరావు తెలిపారు. తక్షణం వేతనాలు అందే విధంగా ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన కోరారు. లంకే తాతరాజు, కుసుమ రమేష్, చెల్లుబోయిన శ్రీనివాస్, బొమ్మిడి శాంతమ్మ పాల్గొన్నారు.

బెంగాలీలు.. భలే జోరు

- నాట్లు వేయడంలో బెంగాలీ కూలీల కొత్త పద్ధతులు
- తక్కువ సమయంలో ఎక్కువ పని
- ఆదా అవుతున్న పెట్టుబడి
- ఆ విధానాలపై మొగ్గుచూపుతున్న రైతులు



వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాయవరం: బెంగాలీ కూలీలకు ఆదరణ పెరిగింది. వారి నేర్పిరితనంతో వరినాట్లు వేస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం వరి నాట్లు జోరందుకున్నాయి. బెంగాలీ కూలీలు బెంగాల్‌లో అనుసరించే సాగు పద్ధతిని ఇక్కడ అవలంబించడంతో చురుగ్గా ముందుకు సాగుతున్నాయి. బెంగాలీ కూలీల రాకతో ఇక్కడి రైతులకు కొంత సాగు భారం తగ్గింది. స్థానిక వ్యవసాయ కూలీల కన్నా బెంగాలీలు వరి నాట్లు వేయడం వల్ల ఖర్చు తగ్గడం, ఆశాజనకమైన దిగుబడి రావడం వంటివి జరగడంతో రైతులు వారిపై మక్కువ చూపుతున్నారు. వ్యవసాయ శాఖ నాట్లు వేసేందుకు తక్కువ నారును ఉపయోగించాలన్న ప్రచారానికి తగ్గట్టుగా బెంగాలీలు నాట్లు వేస్తున్నారు. పంటకు తెగుళ్ల బెడద తగ్గడంతో రైతులు అధిక పెట్టుబడుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. క్లస్టర్ పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుంది. ఈ ప్రాంతానికి బెంగాలీ కూలీల రాక పెరిగింది. సుమారుగా 80శాతం మంది రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి.

గ్రామాల్లో జట్లుగా స్థావరాలు ఏర్పాటు

క్లస్టర్ పరిధిలోని మండలాల్లోని పలు గ్రామాలకు బెంగాలీ కూలీలు వచ్చి జట్టుగా స్థావరాలు ఏర్పాటు చేసుకుని కాంట్రాక్టు ప్రాతిపదికన తెల్లవారుజామున నాట్లు ప్రారంభించి మధ్యాహ్నానికే ముగించుకుని వెళ్తారు. స్థానిక రైతులు గతంలో ఎకరానికి 25 కిలోల విత్తనాలు నారు కోసం వినియోగించేవారు. బెంగాలీ కూలీల రాకతో ఎకరానికి 15 నుంచి 20 కిలోల విత్తనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు సాగు ఖర్చు తగ్గుతోంది. స్థానిక కూలీలు 30 రోజుల వయస్సు గల నారును మాత్రమే నాట్లు వేసేందుకు వినియోగిస్తారు. బెంగాలీలు కేవలం 15 నుంచి 20 రోజుల వయస్సు గల నారుతో నాట్లు వేసేస్తున్నారు. బెంగాలీలు వేసిన నాట్లు నాలుగైదు రోజుల సమయానికి మూనలు తిరుగుతుంటే స్థానిక కూలీలు వేసిన నాట్లకు సుమారు పది రోజులు పడుతుంది. బెంగాలీలు ఊడ్పునకు 10 నుంచి 15 పోగులు వాడుతుంటే స్థానిక కూలీలు సుమారు 45 పోగులకు పైగా వినియోగిస్తున్నారు. ఎకరా నాట్లు వేసేందుకు సాధారణంగా కూలీలు ఆరుగురు అవసరమవుతారు. కానీ బెంగాలీ కూలీలు నలుగురితో పని పూర్తి చేస్తున్నారు. దీంతో ఖర్చు, దిగుబడుల్లో తేడా కనిపిస్తోంది. తద్వారా ఎకరానికి ఐదు బస్తాల దిగుబడులు అదనంగా వస్తోందని రైతులు చెబుతున్నారు. సాగు ఖర్చు సుమారు రూ.5 వేల వరకు తగ్గుతోంది. రైతులు అధికంగా స్వర్ణ రకాన్ని సాగు చేస్తున్నారు.

ఊడ్పు యంత్రం తరహాలో..



ఈ ఏడాది త్వరగా ఖరీఫ్ పనులు ప్రారంభించాం. గత కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నాను. బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయించడానికే ప్రాధాన్యతనిస్తున్నాం. వారు ఊడ్పు యంత్రం తరహాలో నాట్లు వేశారు. దీనివల్ల ఖర్చు తగ్గింది. చీడపీడల బెడద తగ్గింది. ఎకరానికి ఐదు బస్తాల ధాన్యం దిగుబడి పెరిగింది.

– బొంతు ఏడుకొండలు, కౌలు రైతు, సూరయమ్మపేట, పసలపూడి

మంచి ఫలితాలు



బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అధిక శాతం రైతులు వెదజల్లు విధానానికే మొగ్గు చూపుతున్నారు. సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేసే రైతుల్లో అధిక శాతం మంది బెంగాలీ కూలీలతోనే వరినాట్లు వేయిస్తున్నారు. వ్యవసాయశాఖ సూచనలను పాటిస్తూ నాట్లు వేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ఆర్డీఓ కార్యాలయ 'మీ కోసం'కు మూడు అర్జీలు



రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో అర్జీదారుల దరఖాస్తు పరిశీలిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

రామచంద్రపురం: రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్)కు మూడు అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ తెలిపారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఒకటి, 1–డీ ఫారం పట్టా ఇప్పించవలసిందిగా ఒకటి, ఎండీయూ ఆపరేటర్ సమస్యను పరిష్కరించాలని ఒక అర్జీ అందాయని ఆయన తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి ఒకే ఒక్క అర్జీ..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి ఒకే ఒక్క అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు తెలిపారు. తమ భూమి తక్కువగా చూపుతుందని పరిష్కరించాలని ఆ అర్జీలో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు గౌరవ వేతనం అందజేత

రాయవరం: సీస్ సర్వేలో పాల్గొన్న ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు సోమవారం గౌరవ వేతనం అందజేశారు. గతేడాది నవంబరు మూడో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు సీస్ సర్వే నిర్వహించారు. అందులో భాగంగా డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించారు. రాయవరం మండలంలో 50 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను నియమించగా, వారు సర్వేలో పాల్గొన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ నుంచి సొమ్ము విడుదల కాగా ఒక్కో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌కు రూ.500 గౌరవ వేతనంతో పాటుగా, టీఏను అందజేశారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన గౌరవ వేతనాన్ని ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణల చేతుల మీదుగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎ.కృష్ణమూర్తి, అకౌంటెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

కాజులూరు: పంటల సాగుదారుల హక్కుపత్రం (సీసీఆర్‌సీ)తో కార్డుల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని శలపాక వీఆర్వో గనికమ్మ అన్నారు. సోమవారం గ్రామంలో ఆమె రైతులతో మాట్లాడుతూ భూ యజమానికి ఎటువంటి నష్టం కలగకుండా కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కౌలు రైతులు ఈ సీసీఆర్‌సీ కార్డుల ద్వారా బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందడమే కాకుండా ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చేవాటిని పొందవచ్చన్నారు. రైతులు కొత్త కార్డులు, పాత కార్డుల రెన్యువల్ కోసం భూ యజమాని పట్టదారు పాసుపుస్తకం జెరాక్స్ కాపీ, వారి ఫోన్ నెంబరు, కౌలురైతు ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీ, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో తీసుకురావాలన్నారు.

అధైర్య పడొద్దు.. కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాష్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాష్

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అడుగడుగునా అండగా ఉంటామని రామచంద్రపురం పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో గల బీసీ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం కార్యకర్తల మండల స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యప్రకాష్ మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు భయాందోళనకు గురిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ ఆందోళన చెందొద్దన్నారు. మూడు నెలల తరువాత ప్రతి గ్రామంలో పర్యటించి సమావేశాలు నిర్వహించుకుందన్నారు. పేద ప్రజల పక్షాన పోరాటానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలు నేరవేర్చకపోతే ప్రజల పక్షాన ఉండి వారికి సేవ చేద్దామన్నారు. అధినేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా ఆదరణ ఏమాత్రం తగ్గలేదని ఆయన నేతృత్వంలో ప్రజలకు మంచి చేసేందుకు తగిన చర్యలు తీసుకుందామన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలికి ఓట్లు వేసి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షులు పెట్టా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ దూడల చినబాబు, సర్పంచ్‌లు కోటి లక్ష్మీనరసమ్మ, పిల్లి అన్నపూర్ణ, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, కోట సత్తిబాబు, కాపు నాయకులు అడపా నారాయణస్వామి, యర్రంశెట్టి పుల్లేశ్వరరావు, సాదా వెంగళరావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, జుత్తుక శ్యాంప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలికా విద్య ప్రాధాన్యతను గుర్తించాలి



కపిలేశ్వరపురంలో బాలికా సంరక్షణ ప్రాధాన్యతపై మాట్లాడుతున్న నాగేశ్వరి

కపిలేశ్వరపురం: ప్రతి ఒక్కరూ బాలికా విద్య ప్రాధాన్యతను గుర్తించాలని ఎంపీడీఓ కొండలరావు అన్నారు. క్రై చైల్డ్ రైట్స్ అండ్ యు సంస్థ దేశ వ్యాప్తంగా ఏడు వారాలు నిర్వహించనున్న పూరి పడాయి దేశ్‌కి భలాయి ప్రచార కార్యక్రమాన్ని కపిలేశ్వరపురంలో నిర్వహించారు. ముఖ్య అతిథులు ఎంపీడీఓ కొండలరావు, ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, శ్రమ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ నాగేశ్వరి హాజరయ్యారు. నాగేశ్వరి మాట్లాడుతూ క్రై సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్ పర్యవేక్షణలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బాలికల విద్యపై సామాజిక వైఖరిని మార్చడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ముందుకు సాగుతున్నామన్నారు. సాంఘిక కట్టుబాట్లు పేరుతో బాలికలను మానసికంగా హింసిస్తూ సమాజానికి దూరంగా ఉంచడాన్ని తప్పుబట్టుతూ ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞా ఫ్లెక్సీపై సందర్శకులు బాలికా సంరక్షణకు పాటు పడతామంటూ సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.తాతారావు, పంచాయతీరాజ్ ఏఈ డీవీ రాఘవులు, హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎన్ మూర్తి, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సై నరేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం



జిల్లా ఎస్పీ శ్రీధర్ నుంచి బెస్ట్ సర్వీసెస్ అవార్డును అందుకుంటున్న ఎస్సై నరేష్

రాయవరం: సాధారణ ఎన్నికల్లో అందించిన ఉత్తమ సేవలకు రాయవరం ఎస్సై జి.నరేష్ బెస్ట్ సర్వీసెస్ అవార్డును అందుకున్నారు. ఈ విషయాన్ని ఎస్సై నరేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఎస్.శ్రీధర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన మార్చి 16వ తేదీ నుంచి కౌంటింగ్ అనంతరం వరకు మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతిభద్రతలు పరిరక్షణకు కృషి చేసినందుకు ఈ అవార్డును అందజేశారని తెలిపారు. ఎస్సైను ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రజలు శ్రద్ధ వహించాలి



గొల్లపాలెంలో తాగునీటి పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాజులూరు: గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలు తగిన శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఐ.రత్నరాజు అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపాలెం తదితర గ్రామాల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా పర్యటించి తాగునీటి పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఐ.రత్నరాజు మాట్లాడుతూ చెదురుమదురు వర్షాల కారణంగా గ్రామాల్లో అపారిశుధ్యం తలెత్తి డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సక్రమించే అవకాశం ఉందన్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవటంతో పాటు తాగునీరు వినియోగంపైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గొల్లపాలెం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, తాడి చిన్నారెడ్డి, ఆరోగ్యశాఖ సిబ్బంది నరాల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

కె.గంగవరం: నేటి నుంచి గ్రామాల్లో జరిగే నేను బడికిపోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సోమవారం నేను బడికి పోతా కార్యక్రమంపై హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో పర్యటించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. వలంటీర్ల సహాయంతో వారిని బడిలో చేర్పించి స్టూడెంట్ కిట్ ఇతర విద్యా ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. వయసుకు తగిన తరగతిలో చేర్చి వారికి మెరుగైన విద్యతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించాలని చెప్పారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరాలని కోరారు. ఎంఈఓ–2 చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'విద్యా ప్రవేశం'ను బాధ్యతగా తీసుకోవాలి



సోమేశ్వరం పాఠశాలలో విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలిస్తున్న డీవైఈవో నరసింహఫణి

రాయవరం: బడి ఈడు ఉన్న పిల్లల్ని పాఠశాలలో చేర్పించే ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన 'విద్యా ప్రవేశం' కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా తీసుకోవాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద నరసింహఫణి పిలుపునిచ్చారు. మండలంలోని సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీవైఈవో నరసింహఫణి మాట్లాడుతూ విద్యాప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పాఠశాల స్థాయిలో పేరెంట్స్ కమిటీలను కలుపుకుని ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకూ బడి ఈడు ఉన్న విద్యార్థులందరూ బడిలోనే ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి తరగతి సామర్థ్యాలను చేరుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో నైపుణ్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీఎల్‌ఎం సహాయంతో విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మూడో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా పర్యవేక్షణ చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.దయామణికి సూచించారు.

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి



గంద్రేడులో ప్రజలకు సరఫరా చేస్తున్న నీటి స్వచ్ఛతను పరిశీలిస్తున్న అధికారులు

పెదపూడి: తాగునీటిని ప్రతి రోజూ క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేయాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్ సిబ్బందికి ఆదేశించారు. గంద్రేడు, చింతపల్లి గ్రామాల్లో వారు సోమవారం పర్యటించి, వాటర్ ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని క్లోరినేషన్ చేశారా, లేదా, నీటి పరీక్ష, ట్యాంకు ఎలాంటి పరిస్థితుల్లో ఉంది తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వాతావరణంలో మార్పుల కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. వారి వెంట ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు వాసంశెట్టి శిరీష, ఎస్‌వీ స్వామి నాయకుడు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైన్ మధ్యలో మ్యాన్ హోల్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. సోమవారం చైర్‌పర్సన్ దుర్గారాణి టిడ్కో గృహాలను సందర్శించారు. కమిషనర్ బొడ్డేపల్లి రాముతో కలిసి కాలనీలోని వీధుల్లో పర్యటించారు. అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న మహిళలను పిలిచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్ని సమస్యలు ఏమైనా ఉంటే త్వరగా పరిష్కారం చేసి కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అపార్ట్‌మెంట్లకు సంబంధించిన డ్రైన్లను అన్నింటినీ పరిశీలించారు. డ్రైన్ల ద్వారా మురుగు నీటి పారుదల సక్రమంగా జరుగుతుందా లేదా అని అడిగితెలుసుకున్నారు. కొన్ని డ్రైన్ల మధ్యలో వున్న మ్యాన్‌హోల్స్‌ను ఓపెన్ చేయించి పరిశీలించారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను బయటకు తీయించి, వాటర్ పంపింగ్ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, గ్రంధి శ్రీనివాస్, డిఈఈ కే శ్రీనివాస్, టిడ్కో సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాపారాలు చేసేవారంతా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందే

స్పష్టం చేసిన మున్సిపల్ కమిషనర్ మనోహర్



మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో చర్చిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలో వ్యాపారాలు చేసే వారంతా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ స్పష్టం చేశారు. ఇటీవల ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వ్యాపారులకు మున్సిపాలిటీ నోటీసులు ఇచ్చిన క్రమంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు కమిషనర్ మనోహర్‌ను సోమవారం స్వయంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ ట్రేడ్ లైసెన్స్‌ల ప్రాధాన్యతపై వ్యాపార ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో షాపులకు కొలతలు కొలిచి ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చే విధానం వద్దని, షాపునకు మాత్రమే లైసెన్స్ విధించే విధానం అమలు చేయాలని చాంబర్ అధ్యక్షుడు తాతాజీ కమిషనర్‌ను కోరారు. అలాగే పట్టణంలో పలు వ్యాపారులకు ఆయా దుకాణాల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపాలిటీ రెవెన్యూ అధికారి శిరిగినీడి శివాజీ, చాంబర్ ప్రతినిధులు కుప్పాల రామకృష్ణ, నిట్టాల శ్రీరామ్, యర్రా సతీష్, యెండూరి చంటి తదితరులు పాల్గొన్నారు.